# అనగనగా... ఒక కథ

బేగంపేట విమానాశ్రయానికి టేక్సీలో, టేక్సీకన్నా వేగంగా ఉన్న మనస్సుతో వచ్చాడు-పరుగు పరుగున అప్పుడున్న బోంబే ఫ్లైట్ అందుకోవాలని తాపత్రయం.

ఓ ప్రైవేట్..కౌంటర్ దగ్గరకెళ్లి..ఆత్రంగా టికెట్ తీసుకోబోయాడు.

''సారీ..యూ ఆర్ టూ లేట్! జస్ట్ ట్వెంటీ మినిట్స్ బేక్ ద లాస్ట్ ఫ్లైయిట్ ఆల్సో..''

శశికుమార్ కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

ఈమధ్య 'యూ ఆర్ టూలేట్' అని ఎన్ని సార్లు విన్నాడో...

యస్..అయామ్ 'టూలేట్!' అనుకున్నాడు.

★★★

పాతికేళ్ల క్రితం పాతికేళ్ల శశికుమార్ విదేశాల వ్యామోహంతో కన్నవాళ్లనొదిలి వచ్చేశాడు- అదో అందమైన అద్భుతమైన అమెరికా స్వర్గం.

ఏదో ఉద్యోగంలో జేరాడు గానీ..అది వదిలేసి మరో గోల్డెన్ డాలర్ చెయ్యిపట్టి ఆమె డైరక్షన్లో అంచెలంచెలుగా ఎదిగాడు- ఎదిగాడో...దిగజేరాడో తెల్సుకునేప్పటికి టూలేట్..అయిపోయింది!

భార్య ఏసీలిన్ డైరక్షన్ డామినేట్ చేసింది- అని తెల్సేటప్పటికి...అతనికి 50 ఏళ్లు తలమీద కొచ్చాయి- కాళ్లు ఆ భూమ్మీద నిలవడానికి సహకరించట్లేదు.

'నేను మా దేశం వెళ్లిపోతాను'' అన్నాడు అరుస్తున్నట్లుగా ఓ రోజు.

''ఎక్కడికి'' అని ఇంగ్లీషులో నవ్వింది ఏసీలెన్ ఎకసెక్కెంగా.

''మా అమ్మా నాన్న దగ్గరికి!'' గంభీరంగా అన్నాడు శశికుమార్.

''ఓ.. ఆర్ దే ఎలైవ్..యూనో...వాళ్లెపుడో పోయుంటారు''

శశికుమార్ దగ్గర సమాధానం లేదు.

ఎగిరిపడి నవ్వింది ఏసీలిన్-నవ్వుతున్నంత సేపూ శశి గుండె రగుల్తూనే వుంది.

''యూ...ఆర్..ఎ గ్రేట్ సన్ ఆఫ్ ది పూర్ పేరెంట్స్''

''నో..అయామ్ ఎ పూర్ సన్ ఆఫ్ ది గ్రేట్ పేరెంట్స్''

''యూ ఆర్ టూలేట్''

''నీ నిజ స్వరూపం తెల్సుకోడానికా..''

## టూ లేట్

''నీ స్వస్వరూపం తెల్సుకోవడానికి..యూ ఆర్ టూ లేట్''

★★★

అర్ధాంగిపై అలిగి, అమెరికా వదిలి, అమ్మానాన్న కోసం వెళ్లామనుకునేటప్పటికి పాతికేళ్లు గడిచిపోయింది...ఏసీలిన్ అన్నది నిజమేమో..వాళ్లింకా బతికున్నారో లేదో.

అవును పాతికేళ్లనుంచీ ఉత్తరప్రత్యుత్తరాలు జరగలేదు.

తన ఎడ్రస్ కూడా వాళ్లకి తెలియనియ్యలేదు.

పిఠాపురమో, పెందుర్తో అంటే తెలుస్తుంది కానీ...అమెరికాలో వినిపోటా..అంటే ఏం తెలుస్తుంది. అందుకే వాళ్లనుంచి ఏ కేకలూ వినిపించకుండా వాళ్లెలా వున్నారో అన్న ఆలోచన లేకుండా..బిజీ బిజినెస్ల్లో ఇన్నాళ్లు గడిపేశాడు.

పాతికేళ్ల తర్వాత వెళ్తే అమ్మానాన్నా ఆగ్రహిస్తారా..ఆనందిస్తారా ఆగ్రహిస్తే ఆ పరిస్థితి ఎలా తట్టుకోవాలో తనకి తోచలేదు.

కానీ వెళ్లాలి! టూ లేట్ అయినా వెళ్లాలి! ఎంత లేట్ అయినా వెళ్లాలి!

అమ్మా నాన్న 'ఎంతగా పరితపించెనో..ఏమనుచు దుఃఖించెనో..' అన్న మాటా..

'అమ్మా అని అరచినా...ఆలకించవేమమ్మా' అన్న పాటా గుండెల్లో మరతిప్పుతోంది.

''యస్..అయామ్..టూ లేట్'' అనుకున్నాడు శశికుమార్.

★★★

ఆదరాబాదరా హైదరాబాద్ చేరాడు.

ఇల్లు ముందు భాగం పూర్తిగా కూలిపోయింది.

విశాలమైన హాలు ఓ అరుగులా మారిపోయింది. పక్కనుండే పడగ్గది ప్రధాన ద్వారం అయింది..శశికుమార్కి కళ్లు చెమర్చాయి.

'తను పూర్తిగా వీళ్లని వదిలెయ్యకుంటే-ఈ ఇల్లు ఇలా కూలిపోయేదా..' అన్న భావన గుండె పిండింది.

తలుపుకొట్టి నిలబడ్డాడు-

70 ఏళ్లు మించి ముసలాడిగా కనిపిస్తున్న ఒక వ్యక్తి తలుపు తీశాడు.

''ఎవరు స్వామీ...ఎవరు కావాలి?''

''నా పేరు శశికుమార్..లలిత్ నారాయణ గారు లేరా..''

లలిత్ నారాయణ దేహం అంతా కంపించింది.

చనిపోయిన వ్యక్తి వచ్చి..'నేను ఫలానా'' అని చెప్పినప్పటి భయం వణుకు అది!

''ఏమన్నావ్..శ..శి..కు..మా..ర్..వా?''

''అవునండీ-లలిత్ నారాయణగారి...గారి కోసం..''

''ఎవరండీ..'' అలికిడి విన్న శకుంతల భర్త వెనకగా నిలబడి వచ్చిన వ్యక్తిని చూస్తూ అడిగింది.

శశికుమార్ తల్లిని గుర్తుపట్టాడు.

''అమ్మా..నేను...శశిని!! నాన్నా..నేను!!''

''ఆ..శశివా ఆ..'' అంటూ ఆమె కుప్పకూలిపోయింది.

ఆ ఆక్రందనకి చేతనంలోకి వచ్చాడు నారాయణ!

భార్య ముందు కూచుని ఆమెని సముదాయించబోయాడు.

శశికుమార్ అమ్మపక్కకి చేరాడు.

''ఏవండీ..వాడు శశేనా..శశిదయ్యం కాదు

కదా!'' అంటూ బావురుమని ఏడిచింది.

శశికుమార్‌కి తను గనక చచ్చిపోయి వుంటే వీళ్లికన్నాళ్లు కనిపించకుండా ఉంటానా-దయ్యంలా ఎప్పుడోవచ్చి సాయ పడేవాణ్ణనిపించింది!

''అవున్లే-వాడేట-నేను పోల్చుకోలేకపో తున్నాను'' మాటలు కూడబలు క్కుంటూ అన్నాడు నారాయణ.

శకుంతల ఏడుస్తూ లేచింది. వణుకు తున్న చేతుల్లోకి అతని ముఖాన్ని తీసుకుని తడిమి..''శశీ..నాన్నా శశీ..నువ్వేనా..నువ్ శశివేనా''

''అవునమ్మా నేనే..'' అంటూ ఆమెని కౌగలించుకున్నాడు-ఆనందమో దుఃఖమో తెలియదు- ఆవిడ ఏడుపు నాపుకోడానికి చాలాసేపే అతని చేతుల్లో ఉండిపోయింది. నెమ్మదిగా కోలుకుంది. అతన్ని విడిపించు కుంది.

''ఎందుకొచ్చావ్..ఎందుకొచ్చావురా-వీణ్ని ఎందుకు లోపలికి రానిచ్చారండీ'' అని భర్తని నిలదీసింది.

''వీడు చచ్చిపోయాడని ఎప్పుడో నీళ్లొ దిలేసేంకదండీ- వీడు నా బిడ్డకాదు-పొమ్మ నండి''

''అమ్మా..అమ్మా..నన్ను క్షమిం చవా..''

''నిన్ను క్షమించడానికి నీకు అమ్మలే దురా..నాకు కనిపించకు ఈ దేశం విడిచి వెళ్లిపో దూరంగా- ఫో..''

''నాన్నా''

''చాలారోజుల్నుంచి మీ అమ్మ ఏడుపు మర్చిపోయి బతుకుతోందిరా..నువ్వొచ్చి ఆవిడ ఆయుర్దాయాన్ని తగ్గించకు-వెళ్లిపోరా''

''ఇప్పుడు విమానం కూడా లేదు''

''లేకపోతే రోడ్డుమీద పడిగాపులు పడమ నండి! ఇక్కడింకొక్కక్షణం కూడా ఉండద్ద నండి!''

''అవునయ్యా..వెళ్లిపో''

శశికుమార్ విషాదంగా బైటికి నడిచాడు.

అతను వెళ్లీవెళ్లగానే 'ఠప్'మంటూ తలుపులు మూసుకున్నాయి.

శశికుమార్ విరక్తుడై టేక్సీస్టాండ్ కెళ్లాడు.

శకుంతల అతను వెళ్లిపోయాడని తెల్సుకు న్నాక తలుపులు తెరిచింది.

''వెళ్లిపోయాడండీ...నా యిష్టం ఇది నా ఇల్లు అనకుండా వెళ్లిపోయాడండీ..వాడు



వెళ్లాడు..నేనే గెంటేశాను..నేనే గెంటేశాను.. గుప్పె డన్నం కూడా పెట్టకుండా గెంటేశా'' అని వెక్కివెక్కి ఏడిచింది.

ఆమెని నారాయణ ఓదార్చక్కర్లేకుండానే... ఏడుపాగిపోయింది..ఊపిరీ ఆగిపోయింది!

నారాయణకి ఏమీ విచారం లేదు.

కర్తవ్యం తెల్సింది బైటకెళ్లాడు.

★ ★ ★

ఎయిర్‌పోర్ట్ దగ్గర దిగాలుగా కూచున్న కొడు కుని ఆటోలో ఇంటికి తీసుకొచ్చాడు.

''ఒరే..ఇన్నాళ్లకి నీకు మేము ఎందుకు గుర్తొ చ్చామో ఎందుకు రావాలనిపించిందో..ఇప్పుడు అర్థమైంది కదా..మీ అమ్మకి నిప్పు పెట్టి-ఆవిడ పేరు చెప్పి గుప్పెడన్నం తిని వెళ్లరా- మీ అమ్మ వండిందే..తన చేత్తో వండిన ఆఖరిముద్ద నీదే అయింది. తినివెళ్లరా దాని ఆత్మ శాంతి స్తుంది..''

శశికుమార్‌ని ఓదార్చటం నారాయణ వల్ల కాలేదు.

''నేనెప్పుడూ టూ లేట్‌గాణ్ణే నాన్నా'' అని బావురుమన్నాడు.

''అమ్మా నన్నెప్పటికీ క్షమించవా..'' కుళ్లి కుళ్లి ఏడుస్తున్నాడు.

''క్షమించిందిరా! అందుకే కొరివిపెట్టే అవ కాశం నీకిచ్చింది-వెళ్లు'' నారాయణ కొడుకుని లేపాడు.

'ఇప్పుడు మాత్రం నేను టైముకే వచ్చాను! టూలేట్ కాదు' అనుకున్నాడు శశి ఏడుస్తూ.